క్లుప్తంగా

అన్నదానం గొప్పది


అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ ఎస్‌కే రోషన్

కమలాపురం : దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని, అన్నదానం చేయడం ఒక పుణ్యకార్యంతో సమానం అని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, మైనార్టీ నాయకుడు ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రామ సేవకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆసుపత్రికి వచ్చిన రోగులకు వడ్డించి ప్రారంభించారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రి వద్ద అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులు, పేద ప్రజలకు ఈ అన్నదాన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా నిలిచిన రామ సేవకుడు చాటకొండు నరసింహారావును వారు అభినందించారు.

వేడుకలను జయప్రదం చేయండి

కమలాపురం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.చంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రగతి కళాశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడం వలన కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు డ్రాప్ అవుట్ కావాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట


ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని కదిరేవారిపల్లెలోని ఆలయంలో శుక్రవారం ధ్వజ శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వేదపండితులు స్వామి వారికి కల్యాణోత్సవంతోపాటు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతుకు ప్రోత్సాహక నగదు బహుకరణ


నీలకంఠారెడ్డికి ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తున్న కె.రామాంజులరెడ్డి

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో శుక్రవారం సింహాద్రిపురం మండల కసనూరు గ్రామానికి చెందిన కటికరెడ్డి రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా కుమారుడు కె.రామంజులరెడ్డి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మంచి దిగుబడి సాధించిన హిమకుంట్ల గ్రామ రైతు నీలకంఠారెడ్డికి రైతు దీవెన కింద రూ.5 వేల ప్రోత్సాహక నగదును అందజేశారు.

మానవీయ విలువలకు ప్రతీక రక్షా బంధన్


ఆర్టీపీపీ అధికారికి రాఖీ కడుతున్న ఓంశాంతి సభ్యులు

జమ్మలమడుగు : కులమతాలకు అతీతంగా సనాతన సాంప్రదాయాని గుర్తు చేస్తూ సోదర భావంతోపాటు విలువలకు ప్రతీకగా ఆత్మరక్షకుడుగా భావించి సోదరులకు అక్క చెల్లెలు రాఖీలు కడుతారని ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఓంశాంతి ఆధ్వర్యంలో ఆర్టీపీపీలోని ఎస్ఈ వాసుదేవరావు, కృష్ణ, మోహన్‌రావు, కల్లమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్ తదితరులకు రక్షాబంధన్ కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రావణ మాసంలో పౌర్ణమినాడు రాఖీ పండుగ జరుపుకోవడం ధర్మాన్ని రక్షిస్తూ విలువలను పెంపొందించడుకునేందుకు గుర్తుగా జరుపుకునే దర్మ మొక్క బంధనం అని కొనియాడారు. దీనినే జంధ్యాల పౌర్ణమి కూడా అంటారని ఆమె సూచించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం


పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఈ కొత్తపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వైస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


చంద్రగిరి ఎన్నికల ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు


ఈ కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నేతలు


ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ఈ కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పెండ్లిమర్రి : మండలంలోని రేపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అభయ అంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహకుల సమక్ష్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో మాజీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేస్ రామాంజులరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ్‌శర్మలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జమ్మలమడుగు ట్రాన్స్‌కో ఏడీ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలో అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమంతో పాటు మరమ్మతులు చేయనున్నట్టు అయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదం..


ప్రమాదానికి గురైన కారు

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లె క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి కారు (ఏపీ39 హెచ్‌ఎఫ్ 9971) అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు దాటి 10 అడుగుల తగ్గులో ఉన్న పొలంలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు, కారులోని నలుగురికి చిన్న గాయాలతో బయటపడ్డారు.

వరాలు కురిపించు.. వరలక్ష్మీమాత


వ్రతంకు హజరైన భక్తులు


పొలతలలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు


పులివెందులలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

పులివెందుల టౌన్ : వరాలు కురిపించు వరలక్ష్మీ మాత అంటూ ఆలయాలలో, తమ ఇళ్లలో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముద్దనూరు రోడ్డు సమీపంలోని స్థానిక శ్రీచక్రసహిత మహాలక్ష్మి ఆలయంలో ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు హనుమంతుశర్మ ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకారాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. విజయవాడకు చెందిన గురుకృష్ణ ఆధ్వర్యంలో కళాకారుల బృందం కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అలాగే స్థానిక మిట్టమల్లేశ్వరస్వామి, అంకాలమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, చౌడేశ్వరిదేవి ఆలయాల్లో వరలక్ష్మి పూజలు నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శ్రీపార్వతిసమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయ అర్చకులు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సామూహిక వ్రతానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డిలు పర్యవేక్షించారు.

పొలతలలో

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం నందు శ్రావణ శుక్రవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ఈఓ కృష్ణానాయక్ సమక్ష్యంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు నిర్వహించారు. వేదపండితులు వరలక్ష్మి వ్రతం విశిష్టత గురించి మహిళలకు వివరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వల్లూరులో..

వల్లూరు : మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. వ్రత మహత్య కథలను చదువుతూ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పైడికాలువలోని శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు హరినారాయణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 1111 కలువ పూలతో అభిషేకించి పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : వరలక్ష్మీదేవి వ్రతంను భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిని చాటుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద వెలసిన శ్రీ లలితాపరమేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకుడు లింగాల చెన్నకేశవస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


వల్లూరు : అమ్మవారికి కలువ పూలతో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచ్‌లకు నిధులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలను నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. సర్పంచ్‌లు అప్పులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే వాటికి బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్లించాలను కోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడత నిధులు విడుదల చేసినా.. గత ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు విడుదల చేయకపోవడంతో సమస్యలతో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల గౌరవ వేతనం రూ.3వేల నుంచి రూ.10వేలకు పెంచాలన్నారు. సర్పంచ్‌లు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలని, 5వ షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధికి, గిరిజన తాండాల గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నాలుగేళ్లుగా రావాల్సిన నిధులను బదిలీ చేయాలన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కూటమి ప్రభుత్వం అధికారం రాగానే పేదలందరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో సొంత ఇండ్లు లేక బాడుగ ఇండ్లలో ఉండలేక ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌లో తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హాస్పిటల్స్ నడుస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్, పొల్యూషన్‌లకు కాలపరిమితి, హాస్పిటల్స్‌కు వచ్చిన రోగుల వసతి, వార్డులు, వాష్ రూమ్‌లు, మంచి నీటి వసతి, రికార్డుల నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు.

ఉంగరం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించండి


ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఇండి పెండెంట్ అభ్యర్థి ముద్దిగారి వెంగల్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో భాగంగా శుక్రవారం పులివెందుల మండలం ఎర్రబల్లె పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్దిగారి వెంగల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ఓటర్లను అభ్యర్థిస్తూ తనకు ఎన్నికల కమిషన్ కేటాయించిన ఉంగరం గుర్తుపై 10వ నెంబర్ గడిలో ఓట్లు వేసి నన్ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నన్ను గెలిపిస్తే మండల అభివృద్ధితోపాటు రైతుల సమస్యలను తీరుస్తానని ఓటర్లకు తెలిపారు.


నల్లపురెడ్డిపల్లెలో ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి ప్రచారం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇండి పెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి నాగేళ్ల సాంబశివారెడ్డి

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలో శుక్రవారం ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి నాగేళ్ల సాంబశివారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లపురెడ్డిపల్లెలో ఆయన ఓటర్లను కలిసి తన గుర్తు బ్యాట్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే మండల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఓటర్లకు తెలిపారు.

ఆశాజనకంగా ఉల్లి పంట సాగు

- నియోజకవర్గంలో 4వేల ఎకరాలలో సాగు
- ఏడాదికేడాది పెరుగుతున్న పెట్టుబడులు
- తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ
- దిగుబడులు వచ్చాక ధరలపై రైతులలో ఆందోళన


వేల్పుల వద్ద సాగులో ఉన్న ఉల్లి పంట

వేముల : ఈ ఏడాది ఉల్లి పంట ఆశాజనకంగా కనబడుతోంది. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి.. ఉల్లికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ పంట పెట్టుబడులతో కూడుకున్నదే అయినా ధరలు ఉంటే ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు చేశాక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగు చేశాక నిర్లక్ష్యం చేస్తే సాగులో దిగుబడులు చేతికి రావు, ఒకసారి పంట తెగుళ్లతో దెబ్బతింటే తేరుకోవడం కష్టం. దీంతోనే రైతులు ఉల్లి పంటను జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు వేయడం ద్వారా సాగులో దిగుబడులు తగ్గిపోయి నష్టాలు వస్తున్నాయి. దీంతో రైతులు పంట మార్పిడితో రైతులు ఉల్లి పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీంతోనే ఉల్లి సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది ఎంతో కొంత పెరుగుతూనే ఉంది.

నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే సాగు

ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా ఉల్లి సాగు విస్తీర్ణం పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే ఉల్లి సాగైనట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దాదాపు 1000 ఎకరాలకుపైనే సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పవచ్చు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె, తొండూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలోనూ, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల్లో అక్కడక్కడ రైతులు ఉల్లి సాగు చేసుకున్నారు. వ్యవసాయ బావులు, బోర్ల కింద ఉల్లి పంటల రైతులు సాగు చేసుకున్నారు.

సాగులో పెరుగుతున్న పెట్టుబడులు

ఉల్లి సాగులో ఏడాదికేడాది పెట్టుబడులు పెరుగుతున్నాయి. మామూలుగా ప్రతి ఏడాది ఉల్లి విత్తనాలు శేరు రూ.600లు ఉంటే ఈ ఏడాది శేరు ఉల్లి విత్తనాలు రూ.1300లకు పెరిగిపోయాయి. ఉల్లి సాగులో ఎకరాకు దిగుబడులు సమయానికి రూ.50 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. ఉల్లి విత్తనాలు మొలకెత్తినప్పటి నుంచి దిగుబడులు అందేవరకు తోటలలో కలుపు తీయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఉల్లి సాగులో పనులకు కూలీ కూడా ఎక్కువగానే ఉంటోంది. పంట కాలం పూర్తయ్యాక ఉల్లి గడ్డలు పీకి వేయడానికి, కోత కోయడానికి ఆదనంగా మరో రూ.20వేల వరకు పెట్టుబడులు అవుతాయని రైతులు చెబుతున్నారు.

ఉల్లి సాగులో 120 రోజులకే దిగుబడులు

ఉల్లి సాగులో దిగుబడులు 120 రోజులకు అందుతాయి. ఈ ఏడాది రైతులు జూన్ మాసంలో ఉల్లి సాగు చేశారు. ఉల్లి పంట సాగు చేసిన 12 రోజులకు మొలకెత్తుతుంది. ఉల్లి విత్తనాలను కర్నూలు జిల్లా నుంచి తెచ్చుకుని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి నాలుగు రోజులకొకసారి నీటితడులు ఇవ్వడం, ప్రతి వారానికొకసారి పంటలో కలుపు తీసే పనులు చేపడతారు. అంతేకాక వారానికొకసారి తెగుళ్ల సోకకుండా మందులను పిచికారి చేస్తారు. వర్షాలు ఎక్కువగా కురిసిన పంట దెబ్బతినే ప్రమాదం ఉండటంతో వర్షపు నీరు పంటలో నిల్వ లేకుండా చూసుకుంటున్నారు.

ఉల్లి సాగులో ధరలతోనే ఆదాయం

ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. అందుకే ఉల్లి సాగులో ఆదాయం రావాలంటే ధరలే ప్రామాణికం, ధరలు ఉంటే ఉల్లి సాగులో ఆదాయం లేకుంటే నష్టాలే. సాగులో ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉండదు. అదే ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడులు వచ్చి ధర క్వింటా రూ.2 వేలకుపైనే ఉన్నట్లయితే పెట్టుబడులు కూడా రాను ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు.

మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా



నాకున్న 3 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. పంట సాగు చేసి రెండు నెలలు కావస్తోంది. మరో రెండు నెలల్లో దిగుబడులు అందుతాయి. దిగుబడులు అందే సమయానికి ధరలు ఉంటే ఆదాయం ఉటుంది. సాగులో 1.50 లక్షల మేర పెట్టుబడులు పెట్టా. ధరలపైనే సాగులో వచ్చే ఆదాయం ఆధారపడి ఉంది.

– చంద్రఓబుళరెడ్డి, ఉల్లి రైతు, గొందిపల్లె

మార్కెట్ ధరలు స్థిరంగా ఉండాలి



ఉల్లిసాగు పెట్టుబడులతో కూడుకున్నదే అయినా ఆదాయం ఉంటుందనే సాగు చేస్తున్నాం. ఉల్లి సాగులో ఆదాయాన్ని శాసించేది ధరలే. ధరలే కీలకం కావడంతో మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉండాలి. ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. ఉల్లి పంటను వేలకు వేలు పెట్టుబడులతో సాగు చేస్తున్నాం. ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతాం.

– రాజారెడ్డి,ఉల్లి రైతు, గొందిపల్లె